

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం : ఎంపీ

రాయచూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాయచూరు విశ్వ విద్యాలయానికి మహర్షి వాల్మీకి పేరును ఖరారు చేయడం హర్షణీయమని రాయచూరు ఎంపీ కుమార్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఎంపీ, అతి పవిత్రమైన గ్రంథమైన రామాయణాన్ని రచించిన వాల్మీకి పేరును విశ్వ విద్యాలయానికి పేరు పెట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. అదే సమయంలో ప్రభుత్వం రాయచూరు నగర ప్రజల చిరకాల కోరిక అయిన మహానగర పాలిక అప్‌గ్రేడేషన్ పై జీఓ జారీ చేయడం సంతోషానిచ్చిందని, ఇక జిల్లా అభివృద్ధిపై తిరుగు లేదని అభిప్రాయపడ్డారు.


బీజేపీ అభ్యర్థి కిశోర్‌కుమార్ బొట్యాడి

కోస్తాలో పాగా
ఎవరిదో..?


కాంగ్రెస్ అభ్యర్థి రాజు పూజారి

- స్థానిక సమరంలో ఉత్కంఠ
- కమలదళానికి మరోసారి కలిసొచ్చేనా..?
- అధికారమే కాంగ్రెస్‌కు కొండంత బలం
- పోటీలో ఇద్దరే అభ్యర్థులు
- నేటితో ప్రచారానికి తెర
- 21న పోలింగ్

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోస్తా సమరంలో గెలుపెవరిదో అనే ఉత్కంఠ నెలకొంది. స్థానిక సంస్థల కోటాలో విధానపరిషత్‌కు ఎన్నికైన కోట శ్రీనివాస పూజారి ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఉడుపి-చిక్కమగళూరు ఎంపీగా గెలుపొందడంతో ఆయన రాజీనామా చేసిన స్థానంలో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ ఎన్నికల్లో గ్రామపంచాయతీ సభ్యులతోపాటు స్థానిక సంస్థల సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. తాలూకా, జిల్లా పంచాయతీల్లో ఎన్నికైన అభ్యర్థులు లేకపోవడంతో నష్టం కలిగినట్లు య్యింది. 2021 డిసెంబరులో జరిగిన దక్షిణ విధానపరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మంజునాథ భండారి, బీజేపీ నుంచి కోట శ్రీనివాసపూజారి పోటీ చేశారు. తొలి ప్రాధాన్యం ఓటుతో ఎవరో ఒకరు గెలుపొందేవారు. కానీ ఎస్‌డీపీఐ నుంచి షాఫిబెళ్ళారె పోటీ చేయడంతో ఎన్నిక రసవత్తరంగా మారింది. తొలి ప్రాధాన్యం ఓట్లలో ఒక అభ్యర్థికి 2,050 ఓట్లు వస్తే గెలుపు సాధ్యమవుతుంది. బీజేపీకీ 3672, కాంగ్రెస్‌కు 2079, ఎస్‌డీపీఐకు 204 ఓట్లు దక్కాయి. ఇలా తీరప్రాంతంలో బీజేపీ తన ప్రాబల్యాన్ని చాటుకుని కోట శ్రీనివాసపూజారి సునాయాసంగా విజయం సాధించారు.



బరిలో బలమైన అభ్యర్థులు

మూడేళ్ల వ్యవధిలో పలువురు ఓటర్లు మృతి చెందడం, కొందరు సభ్యుల అనర్హత, రాజీనామాలతో ఓట్ల సంఖ్యలో వ్యత్యాసం ఉంది. అయితే నామినేటెడ్ సభ్యులకు ఓటింగ్‌కు హక్కు లేకపోవడంతో కొంత బీజేపీకి అనుకూలమవుతోంది. బీజేపీ నుంచి పోటీ చేసేందుకు పలువురు ప్రయత్నించినా జిల్లా యువమోర్చా అధ్యక్షుడు, బీసీ సామాజికవర్గానికి చెందిన కిశోర్‌కుమార్ బోట్యాడి బరిలో ఉన్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీకి తిరుగులేకపోవడంతో పరిషత్ ఎన్నికల్లోనూ అదే జరగనుందని భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి ఉడుపి జిల్లాకు చెందిన రాజు పూజారి పోటీలో ఉన్నారు. 1987లో ఎన్ఎస్‌యూఐ ద్వారా రాజకీయ ప్రవేశం చేసి జిల్లా ఉపాధ్యక్షుడిగా, గ్రామపంచాయతీ, తాలూకా పంచాయతీ, జిల్లా పంచాయతీ అధ్యక్షుడిగా పనిచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సుదీర్ఘ అనుభవం ఉండడంతో టిక్కెట్ కేటాయించారు. ఇక ఎస్‌డీపీఐ నుంచి అన్వర్‌సాదాత్, ఇండిపెండెంట్‌గా దినకర్ ఉల్లాళ్ పోటీలో ఉన్నారు.

21న పోలింగ్



ఈనెల 21న 392 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఓటర్లు 6032 ఉండగా మహిళలు 3,127, పురుషులు 2,905 మంది ఉన్నారు. ఓట్ల లెక్కింపు ఈనెల 24న జరగనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. వీరి తరపున అగ్రనాయకులు ఎవరూ పాల్గొనలేదు. కాంగ్రెస్ నుంచి సీఎం, డీసీఎంలు ప్రచారం చేస్తారని తొలుత భావించినా సాధ్యం కాలేదు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఇటీవలే ఓసారి దక్షిణకన్నడ జిల్లాను సందర్శించి ప్రచారం చేశారు. దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల ముఖ్యనేతలే అభ్యర్థులతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు.

రెండు పార్టీలకూ ప్రతిష్ఠాత్మకమే

అధికారంలో ఉండి ఒక ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోకపోతే పరువు దక్కదని కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. డీసీఎం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఎన్నికల్లో గెలుపొంది తీరాల్సిందేనని స్థానిక నేతలకు సూచించారు. మరోవైపు బీజేపీ తన ప్రాబల్యాన్ని కాపాడుకోవడం సవాల్‌గా మారింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్ సొంత ప్రాంతంలో పట్టు సాధించేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. దాదాపు నెలరోజులుగా అక్కడే మకాం వేశారు. ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల పరిధిలో బీజేపీకి చెందిన వారు స్థానిక సంస్థలలో ఎక్కువమంది సభ్యులు ఉన్నారు. అయితే తొలి ప్రాధాన్యం కంటే ద్వితీయ ప్రాధాన్యతలో మార్పులు వస్తే ఎలాగనే భయం వెంటాడుతోంది. కాగా ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగాలు సర్వం సిద్ధం చేశారు. బహిరంగ ప్రచారం శనివారంతో ముగియనుంది.



లోక్‌సభ టిక్కెట్‌కు ..
రూ. 2 కోట్లు






- సొమ్ము తీసుకుని మోసం చేశారు
- మాజీ ఎమ్మెల్యే భార్య ఫిర్యాదు
- కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి అన్నపై ఆరోపణలు
- ముగ్గురిపై కేసు

బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి అన్న, ఆయన కుమారుడు, సోదరిలపై బెంగళూరు బసవేశ్వరనగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదయ్యింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ ఇప్పిస్తానని 2 కోట్ల రూపాయలు మోసం చేశారని జేడీఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే దేవానంద్ చౌహాన్ భార్య సునితాచౌహాన్ ఫిర్యాదు చేశారు. 2018లో నాగఠాణ నుంచి జేడీఎస్ ఎమ్మెల్యేగా చౌహాన్ గెలుపొందారు. 2023 శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్ - బీజేపీ పొత్తు పెట్టుకున్నాయి. దేవానంద్ చౌహాన్ లోక్‌సభ ఎన్నికల టిక్కెట్ కోసం ప్రయత్నిస్తుండగా శేఖర్‌నాయక్ అనే వ్యక్తి ద్వారా కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి సోదరుడు గోపాల్‌జోషి పరిచయమయ్యారు. మార్చి మొదటివారంలో గోపాల్‌జోషిని చౌహాన్ దంపతులు హుబ్బళ్ళిలో భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ ఇప్పించాలని కోరారు. తన తమ్ముడు ప్రహ్లాద్‌జోషి కేంద్ర ప్రభుత్వంలో పలుకుబడి కల్గినవారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, మీరు కోరినట్లు విజయపుర టిక్కెట్ ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇందుకు రూ.5కోట్లు ఇవ్వాలని కోరడంతో అంత చెల్లించలేమని రూ.2 కోట్లకు ఒప్పందం చేసుకున్నారు. తొలుత రూ.25లక్షలు ఇవ్వాలని, ఆ తర్వాత చెక్కుల రూపంలో ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారన్నారు. గోపాల్‌జోషి చెల్లెలు విజయలక్ష్మికి చెందిన బెంగళూరు బసవేశ్వరనగర్‌లోని ఇంట్లో నగదు ఇచ్చారు. ఆ తర్వాత చెక్కులు ముట్టచెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవానంద్‌కు టిక్కెట్ రాకపోవడంతో సొమ్ము ఇవ్వాలని విజయలక్ష్మి ఇంటికి వెళ్లగా కులంపేరిట దూషించారని, నగదు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ మేరకు సునితా చౌహాన్ బసవేశ్వరనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రహ్లాద్‌జోషి, అన్నగోపాల్ జోషి, ఆయన కుమారుడు అజయ్‌జోషి, చెల్లెలు విజయలక్ష్మిజోషిపై కేసు నమోదు చేశారు.

కేసు విషయమై హోం మంత్రి పరమేశ్వర్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఫిర్యాదును తీవ్రంగానే పరిగణించామని విచారణ సాగుతోందన్నారు. కేంద్రమంత్రి జోషి అన్న గోపాల్‌జోషి పరారీలో ఉన్నారన్నారు. చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఈ కేసులో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ప్రమేయం గురించి తనకు తెలియదన్నారు. నివేదిక వచ్చాకే స్పష్టమవుతుందన్నారు. కాగా బెంగళూరు కేపీసీసీ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

మూడింటిపైనే..
గురి..!

- ఉప ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై కసరత్తు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూడు పార్టీలు
- డీకే దృష్టంతా చన్నపట్టణ పైనే..
- తొలిరోజు శిగ్గావి నుంచి 4 నామినేషన్లు





బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయాలు స్తబ్ధుగా మారాయి. అయితే మూడు స్థానాలకు జరుగుతున్న శాసనసభ ఉప ఎన్నికలతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. చన్నపట్టణ, శిగ్గావి, సండూరు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థుల ఎంపికలో మూడు ప్రధాన పార్టీలు కసరత్తు పెంచాయి. కాంగ్రెస్ జాతీయ నేత కేసీ వేణుగోపాల్ ఇటీవలే బెంగళూరుకు వచ్చి ఎన్నికలపై సమీక్ష జరిపారు. మూడు స్థానాల్లో గెలిచి తీరాల్సిందేనని సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చన్నపట్టణలో గెలుపుకోసం డీసీఎం డీకే శివకుమార్ ఇప్పటికే పట్టుతో ఉన్నారు. ఆయన సొంత నియోజకవర్గానికి అనుబంధమైనది కావడంతో దీనిని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. రెండు నెలలుగా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. సండూరు, శిగ్గావి స్థానాలకు ఇన్‌చార్జ్‌లుగా మంత్రులకు బాధ్యతలు అప్పగించదలిచారు. ఇలా కాంగ్రెస్ అన్ని విధాలా గెలుపుకోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. అందుకు ధీటైన అభ్యర్థులను బరిలోకి నిలపదలిచారు. చన్నపట్టణలో అభ్యర్థి ఎవరైనా తనను గెలిపించాలని, తానే అభ్యర్థినని డీకే శివకుమార్ బహిరంగంగా ప్రకటిస్తున్నారు. చన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగిన కుమారస్వామి కేంద్రమంత్రిగా వ్యవహరిస్తున్నారు. సదరు స్థానాన్ని జేడీఎస్ పార్టీ పదిలం చేసుకోదలిచారు. ఇక్కడ నుంచి అభ్యర్థిని ఎంపిక చేసే బాధ్యత కూడా బీజేపీ అధిష్ఠానం కేంద్రమంత్రి కుమారస్వామికే అప్పగించినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ ఇదే స్థానం టిక్కెట్ ఆశిస్తున్నారు. తానే అభ్యర్థినంటూ ఆయన ప్రచారం చేసుకున్నారు. ఇప్పటికే విందులు, వినోదాలు, సభలు, సమీక్షలతో బిజీగా ఉన్నారు. ఒకవేళ టిక్కెట్ దక్కకపోతే ఆయన పార్టీకి పనిచేస్తారా..? అనేది కూడా ప్రశ్నార్థకమవుతోంది.

ఇక సండూరు స్థానం విషయంలో మాజీ మంత్రి గాలి జనార్ధనరెడ్డి మరో రెండు అడుగులు ముందుకెళ్లారు. సండూరులో ఓ ప్రత్యేకమైన ఇంటిని సిద్ధం చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ ప్రత్యేకదృష్టి సారించారు. ఎన్నికల నోటిఫికేషన్ వేళ వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి వివాదంలో జైలుపాలైన మాజీ మంత్రి నాగేంద్ర విడుదల కావడం కాంగ్రెస్‌కు కలసి వచ్చినట్లు అయ్యింది. జైలునుంచి బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే సీఎం సిద్దరామయ్యను నాగేంద్ర భేటీ అయ్యారు. ఇదే సందర్భంలోనే సండూరు ఎన్నికల్లో గెలుపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇక హావేరి విషయంలో బీజేపీ నుంచి మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై కుమారుడికి టిక్కెట్ ఇప్పించే విషయమై చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్ నుంచి ఎటువంటి ప్రగతి ఇంకా ఖరారు కాలేదు.

తొలిరోజు 4 నామినేషన్లు

మూడు శాసనసభ స్థానాలకు నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. తొలిరోజున శిగ్గావి స్థానానికి 4సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో ఏ రాజకీయ పార్టీ అనేది పొందుపరచలేదు. ముగ్గురు పురుషులే నామినేషన్లు వేశారు.



వేడెక్కిన సండూరు రాజకీయం

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉప ఎన్నిక జరగనున్న సండూరు రాజకీయం వేడెక్కింది. కీలక నేతలంతా ఇక్కడి ఎన్నికను ప్రతిష్ఠగా భావిస్తున్నారు. మాజీ మంత్రి జనార్ధన్ రెడ్డి, శ్రీరాములు, బి.నాగేంద్ర సండూరు ఉప ఎన్నికలను వ్యక్తిగత ప్రతిష్ఠగా తీసుకున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో లోక్‌సభ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిని చూసిన శ్రీరాములు ఈ సారైనా ఇక్కడ గెలిచి ప్రతిష్ఠను కాపాడుకోవాలని చూస్తున్నారు. ఈ ఓటమి బయట పడేందుకు శ్రీరాములు సండూరు ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నారు. దీంతో శ్రీరాములు సండూరు నియోజకవర్గంలో బరిలో దిగే అవకాశం ఉంది. అయితే తన స్నేహితుడైన జనార్ధన్ రెడ్డి మద్దతు లభిస్తుందా లేదా అనేది ప్రస్తుతం వేచి చూడాల్సిన పరిస్థితి. జనార్ధన్ రెడ్డి బీజేపీలో చేరి శ్రీరాములతో మరీ పాత దోస్తు కొనసాగే అవకాశం ఉందనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే శ్రీరాములు, జనార్ధన్‌రెడ్డి మధ్య సత్సంబంధాలు లేవనే గుసగుసలు వినిపిస్తున్నాయి. శ్రీరాములకు గాలి మద్దతు ఇస్తారా..? లేదా?.. వేచి చూడాల్సి ఉంది. ఇక సండూరు నియోజకవర్గం బీజేపీ నుంచి పోటీ చేసేందుకు శ్రీరాములతో పాటు19మంది ఆశావహులు ఉన్న ట్లు తెలుస్తోంది. బంగారు హనుమంతు, కెఎస్ దివాకర్, దేవేంద్రప్ప, శ్రీరాములు తదితరులు పోటీల్లో ఉన్నారు. అయితే టికెట్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది. మాజీ మంత్రి బి.నాగేంద్ర జైలు నుండి విడుదలైన తరువాత సండూరు ఎన్నికల వాతావరణం మరింత మారింది. బీజేపీ గనుల యజమానులపై రాజకీయ కక్ష తీర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. బళ్ళారి ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఇప్పటికే సండూరు ఎన్నికల ఇన్‌చార్జ్ బి.నాగేంద్ర అంటూ ఇప్పటికే ప్రకటించారు. దీంతో ప్రస్తుతం, మాజీ మంత్రుల సారథ్యంలోనే సండూరు ఎన్నికలు ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. కాంగ్రెస్ నుంచి ఎంపి ఇ. తుకారాం భార్య అన్నపూర్ణ తుకారాం, కుమార్తె చైతన్య తుకారం, తుమటి లక్ష్మణ, సందీప పైపోటీలో ఉన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ తుకారం కుటుంబ సభ్యులకే టికెట్ ఇవ్వడానికి సముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గతంలో సండూరు ఎమ్మెల్యేగా ఉన్న తుకారం హైకమాండ్ సూచన మేరకు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీనియర్ నాయకులైన శ్రీరాములపై పోటీకి దిగి.. విజయం సాధించారు. అధిష్ఠానం ఆయన కుటుంబంవైపే మొగ్గుచూపే అవకాశం ఉంది. మరీ ముఖ్యంగా ఓ వైపు గాలి స్నేహితుడు, మరో వైపు శిష్యుడు నాగేంద్ర బరిలో ఉండడంతో గాలి మద్దతు ఎవరికి అనేది ఉత్కంఠగా మారింది.

జైలులోనే దందా..!

- అధికారులను బ్లాక్‌మెయిల్
- ఖైదీల నుంచి డబ్బు వసూలు
- అనుమానాస్పద ఉగ్రవాది హల్‌చల్
- కలబురగి జైలులో వెలుగులోకి..



బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జైలులోనూ దందా కొనసాగిస్తూ జైలు అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాడా ఆ ప్రబుద్ధుడు. మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం వద్ద బాంబు పేలుడు కేసులో అరెస్టు అయిన అనుమానాస్పద ఉగ్రవాది జుల్ఫికర్ అలి కలబురగి జైలులో గడుపుతున్నాడు. అయితే జైలులో కూడా ఇతడి దందా తీవ్రమయ్యాయనే విషయం వెలుగులోకి వచ్చింది. జుల్ఫికర్ మొబైల్ వాడతాడని, ఖైదీలనుంచి జైలు అధికారులు డబ్బులు తీసుకునే దృశ్యాలు వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏకంగా పదిమంది అధికారులను బెదిరిస్తూ తీవ్రమైన దందాలకు పాల్పడుతున్నాడని, తోటి ఖైదీలనుంచి కూడా పలు డిమాండ్‌లు పెడుతున్న అంశం హల్‌చల్ చేస్తోంది. ఇతడు ఉపయోగించే మొబైల్‌ను తోటి ఖైదీలకు అద్దెకు ఇస్తాడని, ఆడియో, వీడియో కాల్స్‌కు ధర నిర్ణయించి వసూలు చేస్తాడన్న ఆరోపణలు ఉన్నాయి. జైలునుంచి ముంబై, పాకిస్థాన్‌లోని పలువురితో మాట్లాడుతుంటాడని, మతప్రసంగాలు చేస్తాడనే ఆడియో సంభాషణలు వైరల్ అయ్యాయి. జుల్ఫికర్‌పై ఆరోపణలు రావడంతో శుక్రవారం బెంగళూరు నుంచి జైళ్లశాఖ ఉన్నతాధికారుల బృందం కలబురగికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి సమగ్ర నివేదికను తయారు చేసి చర్యలు తీసుకోదలిచినట్లు తెలుస్తోంది. 2013 ఏప్రిల్ 17న బీజేపీ ఆఫీసు ముందు బాంబు పేలుళ్ల కేసులో జుల్ఫికర్ ప్రధాన సూత్రధారి. పేలుళ్లలో 11మంది పోలీసులు సహా 16మంది గాయపడ్డారు. వ్యాన్, కార్ల మధ్య ఓ ద్విచక్రవాహనాన్ని ఉంచి బాంబు పేల్చిన విషయం తెలిసిందే.




కాలువలో పొంగుతున్న నురగ

నురగ నీటితో రైతుల్లో ఆందోళన

హోసూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలవల్లో నురగనీటితో రైతుల్లో ఆందోళన నెలకొంది. దక్షిణా పినాకిని నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో హోసూరు కెలవరపల్లి డ్యాంకు ఇన్‌ఫ్లో భారీగా తగ్గింది. అయితే ప్రవాహం తగ్గినా నురగ నీరు నిండి పోయి కాలవ నిండుగా కనిపిస్తోంది. సమీప ప్రాంతంలోని పారిశ్రామిక వాడల నుంచి వెలువడే రసాయనిక వ్యర్థాల కారణంగానే నురగ వ్యాపిస్తోందని, దీంతో పంటలు దెబ్బ తినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు వ్యర్థాలను కాలవల్లో వదలకుండా చూడాలని వారు కోరుతున్నారు. శుక్రవారం డ్యాం నుంచి 667 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యామ్ మొత్తం సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 40.51 అడుగులకు నీరు చేరింది. ఒక్క తూము మాత్రమే తెరిచారు.

బంగారు నగలంటే మగువలకు మక్కువ

- పండుగల వేళ జ్యూవెల్స్ మేళా హర్షణీయం: నటి రాధికా పండిట్

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలంటే మగువకు మక్కువని, తానూ భిన్నమైన డిజైన్‌ల నగలనే ఎంపిక చేసుకుంటానని ప్రముఖ నటి రాధికాపండిట్ అభిప్రాయపడ్డారు. జ్యూవెల్స్ ఆఫ్ ఇండియా ప్రదర్శనలను శుక్రవారం త్రిపుర వాసిని ప్యాలెస్‌లో ఈ ఏడాది రాయబారిగా వ్యవహరిస్తున్న రాధికాపండిట్ ప్రారంభించారు. ఈసందర్భంగా దేశంలోని ప్రముఖ జ్యూవెల్స్ సంస్థల ముఖ్యులు కొనుగోలు దారులు, అభిమానులను ఉద్దేశించి రాధికాపండిట్ మాట్లాడుతూ బంగారు ఆభరణాలు మన సంస్కృతిలో భాగమని దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ ఒక ప్రత్యేకమైన డిజైన్‌కు శతాబ్దాల కాలంగా ఆదరణ ఉందన్నారు. ఇలా అన్ని ప్రాంతాల సంస్కృతిని చాటే డిజైన్‌లు ఒకే చోటున లభించడం సంతోషకరమన్నారు. పండుగల వేళ కోరుకున్న ఆభరణాలను సొంతం చేసుకునేందుకు వినియోగదారులకు వీలుందన్నారు. జ్యూవెల్స్ ఆఫ్ ఇండియాకు రాయబారిగా వ్యవహరించడం సంతోషమన్నారు. వందకు పైగా పేరున్న జ్యూవెల్స్ సంస్థలు ఒకే చోట పాల్గొనడం సంతోషమన్నారు. అనంతరం జేడీఎస్ ఎమ్మెల్సీ సాయిగోల్డ్ ప్యాలెస్ అధినేత శరవణ మాట్లాడుతూ బంగారం కొనుగోలు చేయడం ద్వారా అందంగా అలంకరించుకోవడంతో పాటు అవసరానికి నగదుగా మార్చుకునే వెసలుబాటు ఉందన్నారు. వెండి ధరలు కూడా అమాంతం పెరిగాయన్నారు. జ్యూవెల్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చేతన్‌కుమార్ మెహ్తా, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ గన్నా, కన్వీనర్ విక్రమ్‌మెహ్తాలు ముఖ్యులుగా పాల్గొన్నారు. జ్యూవెల్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు సందీప్ బెకెల్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ఎక్కువమంది సందర్శకులు, సంస్థలు, కొనుగోలు దారులు పాల్గొనే ఏకైక జ్యూవెల్స్ మేళాగా అభిప్రాయపడ్డారు. 1999లో జ్యూవెల్స్ ఆఫ్ ఇండియాను ప్రారంభించామని, నాటి నుంచి నిరంతరంగా మేళా సాగుతోందన్నారు.



జ్యూవెల్స్ ఆఫ్ ఇండియా మేళాను ప్రారంభిస్తున్న నటి రాధికా పండిట్

మేళాలో ఆభరణాలను వీక్షిస్తూ...



నాణ్యతకు నిదర్శనం


పురాతన భవనం

వందేళ్లయినా చెదరని భవన నిర్మాణం

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కట్టిన ఐదారేళ్లలోనే కూలిపోతున్న లేదా దిబ్బ తింటున్న ప్రభుత్వ భవనాలు కొన్ని మనకు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే వందేళ్లు దాటినా చెక్కు చెదరకుండా నాణ్యమైన నిర్మాణానికి నిదర్శనంగా నిలుస్తోంది ఉరవకొండలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని భవనం. దీన్ని స్వాతంత్ర్యానికి పూర్వం 1910లో నిర్మించారు. గోడలను రాళ్లతో నిర్మించి, పైకప్పు పెంకులతో వేశారు. బ్రిటిష్ వారి పాలనలో నిర్మించిన ఈ భవనాన్ని 2012 వరకూ తహసీల్దారు కార్యాలయంగా వాడుకునేవారు. ప్రస్తుతం ఈ భవనాన్ని వీఆర్వోలు వినియోగిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఆర్కిటెక్ అధికారులు ఈ భవనాన్ని పరిశీలించారు. 114ఏళ్ల కిందట నిర్మించినప్పటికీ ఈ భవనం పటిష్ఠంగా ఉందని తెలిపారు. నిస్వార్థంగా కడితే ఏ కట్టడమైనా ఇలాగే పటిష్ఠంగా ఉంటుందని ఇక్కడికి వచ్చిన వారు పేర్కొంటున్నారు.

పుష్ప విలాపం

- వర్షాలకు దెబ్బతిన్న బంతిపూలు
- తగ్గిన ధరలతో రైతుల దిగాలు

బొమ్మనహాళ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో పూల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని మండలంలో బంతిపూలను విస్తారంగా సాగు చేశారు. దసరా తరవాత ధరలు తగ్గి నష్టాలు వచ్చాయి. మండలంలోని దేవగిరి, దేవగిరి క్రాస్, ఉంతకల్లు తదితర గ్రామాల్లో బంతి పూలు సాగు చేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న జడివానకు పూసిన పూలన్నీ కుళ్లిపోతున్నాయి. ఐదు రోజుల కిందట కిలో రూ. 100 పలికిన ధర ప్రస్తుతం కొనేవారు లేక నేల చూపులు చూస్తోంది. దీంతో రైతులు బళ్లారి మార్కెట్టుకు తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.40, రూ.50కు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు.


విరబూసిన పూదోట

ఆలయం ధ్వంసం

బత్తలపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):గుప్తనిధుల వేటగాళ్లు బరితెగించారు. మండలంలోని అప్రాచెరువు గ్రామ సమీపానగల అపరాదయ్య స్వామి ఆలయాన్ని గురువారం రాత్రి పూర్తిగా ధ్వంసం చేశారు. తరాలుగా అపరాదయ్యస్వామి గుడి ఉంది. గుర్తుతెలియని దుండగులు ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి, గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు అక్కడికి చేరుకుని, ఆలయాన్ని తొలగించడం దారుణమని ఆవేదన చెందారు.


ధ్వంసమైన అపరాదయ్యస్వామి గుడి

రేపు విమలాశాంతి పురస్కార సభ

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విమలాశాంతి సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం కవితా పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాకు చెందిన లేదాళ్ల రాజేశ్వరరావుకు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. సాహిత్యాభిమానులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

పొరపాటు పడేరు..!

ఇవి.. భోజనానికి ఏర్పాటు చేసిన ప్లేట్లు కాదు


ఎంఈఓ కార్యాలయంలో వర్షపు నీరు ఫ్లోర్‌మీద పడకుండా ఏర్పాటు చేసిన ప్లేట్లు

కుందుర్పి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇవేవో అతిథులు భోజనం చేయడానికి ఉంచిన ప్లేట్లు కాదు. వాన నీళ్ల కింద పడకుండా చేసిన ఏర్పాట్లు. వానొస్తే భవనమంతా కారుతుండటంతో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయమంతా తడి కాకుండా ఉండటం కోసం ఇలా ప్లేట్లు, జగ్గులు ఉంచుతున్నారు. మండల విద్యాధికారి, సిబ్బంది వర్షాకాలం వస్తే చాలు ఇలా ఇబ్బంది పడుతూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి.

రీ సర్వేతో రికార్డుల్లో భూమి మాయం

రెవెన్యూ సదస్సులో అధికారులకు రైతు ఫిర్యాదు


బాధిత రైతు బసంపల్లి మల్లేష్


రీసర్వే కన్నా ముందు మల్లేష్ పట్టాదారు పాసుపుస్తకం

శెట్టూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రీసర్వే అనంతరం రికార్డులలో తన పేరుమీద ఉన్న భూమి కనిపించడం లేదని మండలంలోని బసంపల్లికి చెందిన రైతు మల్లేష్ పేర్కొన్నాడు. ఈమేరకు శుక్రవారం శెట్టూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టిని కలిసి ఫిర్యాదు చేశాడు. శెట్టూరు రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 46లో 52 ఎకరాల విస్తీర్ణం ఉంది. అందులో మల్లేష్‌కు చెందిన 4.28 పొలం రెవెన్యూ రికార్డుల్లో ఉండాలి. కానీ నాలుగు సెంట్లు మాత్రమే రికార్డుల్లో కనబడుతోందని, మిగిలిన 4.24 ఎకరాలు కనిపించడం లేదన్నారు. న్యాయం చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. రీసర్వే అనంతరం తనకు రెవెన్యూ రికార్డులు, 1బి కానీ, అడంగల్ కానీ రావడం లేదన్నారు. దీంతో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులైన స్పందించి తనకు భూమి రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచాలని ఆయన కోరారు.

కల్తీ కేసులో ఆరు నెలల జైలు

పండ్ల వ్యాపారికి శిక్ష... రూ.50 వేలు జరిమానా కూడా


అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పండ్ల అమ్మకాలలో కల్తీ చేసిన పాపానికి ఓ వ్యాపారి జైలు పాలయ్యాడు. 2015 ఆగస్టు 25న ఫుడ్ సేఫ్టీ అధికారి నాగేశ్వరరావు నగరంలోని మార్కెట్ యార్డులో తనిఖీలు జరిపినట్లు జిల్లా ఆహారభద్రత శాఖాధికారి తస్లీమ్ తెలిపారు. మార్కెట్ యార్డులో బైగారి అశ్వత్థరెడ్డి అనే వ్యక్తి కార్బైడ్‌తో మాగించిన రేగు పండ్లను విక్రయిస్తున్నట్లు గుర్తించారన్నారు. వాటి శాంపిళ్లను రాష్ట్ర ఆహారభద్రత ల్యాబ్‌కు పంపించామన్నారు. పండ్లకు కార్బైడ్ కలిపి అమ్మకాలు జరిపినట్లు నిర్ధారణ అయిందన్నారు. దీంతో నగరంలోని కోర్టులో బైగారి అశ్వత్థరెడ్డిపై కేసు నమోదు చేయించారన్నారు. విచారణ అనంతరం శుక్రవారం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ దోషిగా తేలిన అశ్వత్థరెడ్డికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు తప్పవ్...

- ఆహార భద్రత శాఖాధికారి తస్లీమ్

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు. ఆహార కల్తీలకు పాల్పడితే బైగారి అశ్వత్థరెడ్డి మాదిరే జైలుపాలు కావాల్సి వస్తుంది. ఆహార పదార్థాలకు సంబంధించి వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలి. ఎలాంటి కల్తీలకు తావులేకుండా చూసుకోవాలి. హోటళ్లు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు.. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. తనిఖీల సమయంలో ఏవైనా కల్తీలు జరిగినట్లు తెలిస్తే... శాంపిల్స్ రిజల్ట్ అనంతరం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపారస్తులు జాగ్రత్తలు తప్పక పాటించాలి.

ఇసుక, మద్యంలో వేలు పెట్టొద్దు


మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించను
- పనితీరుపై పార్టీవర్గాల సర్వే ఉంటుంది
- ప్రజల్లో విశ్వసనీయత పొందండి
- టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హితబోధ

అనంతపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారు. ప్రజలు అందుకే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. గత వైసీపీ పాలనలోలాగా ఎవరూ ఇసుక, మద్యం వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దు. ఆ విధంగా ఎవరైనా జోక్యం చేసుకుంటే సహించేది లేదు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదు' అని టీడీపీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత పార్టీ ప్రజాప్రతినిధులకు హితబోధ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో చంద్రబాబునాయుడు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మినహా ఉమ్మడి జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కాగా ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఏ విధంగా నడుచుకోవాలి..? ఏఏ విషయాల్లో జోక్యం చేసుకోకూడదు..? ప్రభుత్వ పనితీరు, ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లాలి..? ఎమ్మెల్యేలుగా ప్రజల విశ్వాసాన్ని ఏ విధంగా పొందాలి..? నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఏ విధంగా అనుసంధానం చేసుకొని పార్టీని మరింత బలోపేతం ఎలా చేయాలి..? తదితర అంశాలపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

సంకేతాలు వస్తున్నాయ్.. సరిచేసుకోండి

గడిచిన నాలుగు నెలల కాలంలో కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి సరిగా లేదన్న సంకేతాలు వచ్చాయ్. వాటిని సరిచేసుకొని ప్రజల్లో విశ్వసనీయత పొందే విధంగా నడుచుకోవాలని హితవు పలికారు. ఎక్కువ శాతం తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలుపొందిన నేపథ్యంలో ఎమ్మెల్యేగా, మంచి రాజకీయ నాయకుడిగా విశ్వసనీయత పొందాలంటే సమయం పడుతుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అలా కాకుండా ఎమ్మెల్యేగా అయిపోయాం.. ఇక మాకు ఎదురులేదనే విధంగా వ్యవహరిస్తే ఒక్క నిమిషంలోనే విశ్వసనీయతను కోల్పోతారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వాస్తవాలకు దగ్గరగా నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఎమ్మెల్యేపై ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. అధికారంలోకి వచ్చాం కదా అని వైసీపీ నాయకుల్లాగా వ్యవహరిస్తే ప్రజలు గుర్తుపెట్టుకుంటార న్న విషయాన్ని ప్రతి ఎమ్మెల్యే గ్రహించాలన్నారు. పార్టీ భవిష్యత్‌ను కాపాడే విధంగా ఎమ్మెల్యేలు నడుచుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లో మరింత గౌరవాన్ని పొందేలా పనిచేయాలని సూచించారు. గత ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు విషయంలో అనేక సర్వేలు చేసిన తర్వాతనే అభ్యర్థులను ప్రకటించామన్నారు. ఎమ్మెల్యేలు గా గెలుపొందిన తర్వాత వారి పనితీరుపైనా పార్టీ నిఘా వర్గాల ద్వారా నిరంతరం సర్వే కొనసాగుతుందన్నారు. ఎక్కడా ఎలాంటి వివాదాంశాల్లోకి తలదూర్చిన, పార్టీ నిఘా వర్గాల ద్వారా తనకు సమాచారం అందుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాని ఎంపీ, ఎమ్మెల్యేలను హెచ్చరించారు.


మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

గడువు పొడిగింపు

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు 2024-25 విద్యా ఏడాది గడువు పొడిగించినట్లు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 25 వరకూ ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకూ అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. రూ. 500 అపరాధ రుసుంతో ఈనెల 30,31వ తేదీల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జడ్పీ సర్వసభ్యసమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రెండోసారి జడ్పీ సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నారు. తొలి సమావేశానికి కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు పెద్దగా హాజరు కాలేదు. దీంతో ఈ దఫా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనికితోడు మెజార్టీ ప్రభుత్వశాఖల్లో ఉన్నతాధికారుల నుంచి ఎగ్జిక్యూటివ్ లైన్‌లోని ప్రధాన అధికారులంతా చాలా మంది ఇటీవల బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు శాఖల్లో కొత్త అధికారులు వచ్చారు. ఈ ప్రభావం కూడా కొంత సమావేశంపై ఉండే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. ఈ సారైనా జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చ సాగిస్తారో... మమ అనిపిస్తారో చూడాలి.

ఓ పనైపోయింది..!

- కేజీబీవీ ఉద్యోగార్థులకు ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన
- 334 మందిలో 239 మంది హాజరు


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఏపీసీ నాగరాజు తదితరులు

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఉద్యోగాలకు దరకాస్తు చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికెట్ల స్క్రూటీనీ నిర్వహించారు. ఏపీసీ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, జీసీడీఓ ఇతర సమగ్రశిక్ష అధికారులు సుమారు 10 బృందాల అధికారుల ఆధ్వర్యంలో అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఉదయమే ప్రాజెక్టు కార్యాలయానికి అభ్యర్థులు చేరుకున్నారు. చంటిపిల్లలతో హాజరైన తల్లులు కొందరు ఇబ్బంది పడ్డారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలని 334మంది అభ్యర్థులకు సమాచారం అందించగా... 239 మంది హాజరైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిందని, గైర్హాజరైన అభ్యర్థులకుస్క్రూటినీ ఉండదని సమాచారం.


చంటి బిడ్డలను లాలిస్తున్న అభ్యర్థుల బంధువులు

నేడో.. రేపో.. కలెక్టర్ చెంతకు...

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల వివరాలను ప్రాజెక్టు అధికారులు శనివారం క్రోడీకరించే అవకాశం ఉంది. హాజరైన అభ్యర్థులు, వారి అర్హతలు, అనుభవం, రోస్టర్ తదితర వివరాలను క్రోడీకరించి సంబంధిత ఫైల్‌ను శనివారం లేదా ఆదివారం జిల్లా కలెక్టర్‌కు పెట్టనున్నట్లు సమాచారం. కలెక్టర్ నుంచి ఆమోదం లభించగానే... అర్హులను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారుల నుంచి స్పష్టమవుతోంది.

టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల చేయాలి


ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను విడుదల చేయాలని ఎస్టీయూ నాయకులు ఆర్జేడీ శామ్యూల్‌ను కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆర్జేడీని కలిశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాను, జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్య టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలను అన్ని డీఎస్సీల టీచర్లకు తయారు చేయాలని ఆర్జేడీకి వినతిపత్రం అందించారు.

ఆర్‌జేడీని కలిసిన ప్రైవేట్ స్కూల్‌యూనియన్ నేతలు

కడప ఆర్జేడీ శామ్యూల్‌ను అనంతపురం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, సీఆర్వో రవిచంద్రారెడ్డి, నగర ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్ ఇతర నాయకులు ఆర్జేడీని కలిసినవారిలో ఉన్నారు.

డీఎడ్ కళాశాల అక్రమాలపై విచారణ

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బుక్కరాయ సముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో జరిగిన అక్రమాలపై ఆర్జేడీ కార్యాలయ అధికారులు విచారణ చేశారు. పాత డీఈఓ ఆఫీస్‌లో ఆర్జేడీ శామ్యూల్, ఏడీ అరుణ్, ఏసీ గోవింద్‌నాయక్‌తో కలిసి డైట్ కళాశాల సిబ్బందిని శుక్రవారం విచారించారు. కళాశాల యాజమాన్యం మారిన నేపథ్యంలో నూతన యాజమా న్యం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో కలెక్టర్, ఆర్జేడీ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విచారణకు ఆదేశించారు. విద్యార్థులను కూడా పిలిపించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


విచారణ చేస్తున్న ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది

రేపు అంకురం వేడుకలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజ సంగీత సభ ఆధ్వర్యంలో ఆదివారం అంకురం శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలు నిర్వహించనున్నట్లు సంగీతసభ అధ్యక్షుడు ఎన్‌సీ సంపత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేరళకు చెందిన అలా వేణుగోపాల్‌తో పాటు వివిధ ప్రాంతాల కళాకారులచే ఆదివారం సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు శాస్త్రీయ, సంగీత నృత్య వేడుకలు నిర్వహిస్తామన్నారు. కళాకారులు, కళాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ సమైక్యత శిబిరానికి మెడికోలు

అనంతపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి అనంతపురం మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శుక్రవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జానకి, దివ్యతేజ్, దివ్య షెకావత్ ఈ నెల 21 నుంచి 27 వరకు హరియాణాలోని ఇందిరాగాంధీ యూనివర్సిటీలో జరిగే శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య యూనివర్శిటీ తరఫున అనంత మెడికోలు ఎంపికైనట్లు తెలియజేశారు. మెడికోలను ప్రిన్సిపాల్, ఎస్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ పరదేశీనాయుడు అభినందించారు.


మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

పని ఒకటి... బిల్లు మరొకటి

- ఇంటిపేరుతో బిల్లు పెట్టి.. అద్దె భవనం రీమోడలింగ్
- జగనన్న ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

విడపనకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి జరిగింది. మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణం చేయకపోయిన వైసీపీ నాయకులు చెప్పిన వారికి హౌసింగ్ అధికారులు బిల్లులు మంజూరు చేశారు. మండల కేంద్రంలో ఉన్న కెనరా బ్యాంక్‌ను వైసీపీ పాలనలో రీ మోడలింగ్ చేయించారు. దానికి పెట్టిన ఖర్చంతా ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇంటి బిల్లులే అని తేలింది. వలిపిరెడ్డి గారి లక్ష్మీ నరసమ్మ ఇంటి ఐడీ నంబరు: 120310ఎన్‌పీఐ1165442, వలిపిరెడ్డి లావణ్య రెడ్డి ఇంటి ఐడీ నంబరు: 120310ఎన్‌పీఐ1328252 కుటుంబ సభ్యుల పేర్ల మీద రెండు జగనన్న బిల్లులు మంజూరు చేశారు. వీరికి సంబంధించిన ఓ ఇంటిని కెనరా బ్యాంక్‌కు అద్దెకు ఇచ్చారు. దాన్ని రెండు జగనన్న ఇంటి బిల్లులు మంజూరు చేయించుకుని రీ మోడలింగ్ చేయించారు. వీరికి బ్యాంకు వారు నెలకు రూ.40వేలు అద్దె ఇస్తున్నారు. రీమోడలింగ్ అనంతరం అద్దె రూ. 50వేలు పైనే చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై గతంలో దండోర జిల్లా కార్యదర్శి కెంగూరి ఎర్రిస్వామి తహసీల్దారు ఈరమ్మకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో చలనం లేదు.


రూఫ్‌లెవెల్ కనిపిస్తున్న పేర్లు



కంప్లీట్ లిస్టులో పేర్లను కనిపించకుండా చేసిన అధికారులు

వ్యాపార సముదాయాలకు సైతం..

హౌసింగ్ అధికారులు మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలకు సైతం జగనన్న ఇంటి బిల్లులు మంజూరు చేశారు. పాత మిద్దెలకు బిల్లులు మంజూరు చేశారు. మండల కేంద్రంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ ఏఈలు వైసీపీ నాయకులతో కుమ్మక్కై మామూళ్లు తీసుకుని రూ.లక్షల బిల్లులు మంజూరు చేశారు. ఒక్కో ఇంటికి రెండు మూడు బిల్లులు మంజూరు చేశారు. కెనరా బ్యాంక్‌కు దాదాపుగా రూ. 4లక్షలు పూర్తి బిల్లును ఇచ్చారు. ఇద్దరి పేర్లను హౌసింగ్ అధికారులు ఆర్ఎల్ (రూఫ్‌లెవెల్)లో బిల్లులు పెట్టేందుకు రికార్డులలో చూపించారు. కానీ పూర్తి బిల్లు(కంప్లీట్)పెట్టె సమయానికి ఇబ్బందులు వస్తాయని తెలివిగా లిస్టులో నుంచి పేర్లను తొలగించారు. ఎవరు సమాచారం అడిగినా కంప్లీట్ లిస్టులో వీరి పేర్లు లేని జాబితా మాత్రమే బయటకు ఇస్తున్నారు. ఆర్ఎల్‌లో ఉండే ఇళ్లు కంప్లీట్‌లోకి వచ్చేసరికి మాయం అయిపోయాయి. హౌసింగ్ అధికారులు మామూళ్లు ఇచ్చిన వారికి, అప్పటి వైసీపీ నేతలు చెప్పిన వారికి ఏమాత్రం వెనుకాడకుండా బిల్లులు మంజూరు చేశారు. మండలంలోని జగనన్న ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపి, ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని జిల్లా అధికారులు, మండల అధికారులకు ఇదివరకే మండల ప్రజలు, దండోర నాయకులు ఫిర్యాదు చేశారు.



జగనన్న ఇంటి బిల్లుతో రీమోడలింగ్ చేసిన కెనరా బ్యాంక్

ఈ విషయమై హౌసింగ్ అధికారులను వివరణ కోరగా వలిపి రెడ్డి లక్ష్మీనరసమ్మ, వలిపి రెడ్డి లావణ్య రెడ్డికి సంబంధించి రెండు ఇళ్లకు బిల్లులు పూర్తిగా మంజూరు చేశామన్నారు. రెండు బిల్లులు పెట్టిన మాట వాస్తవమే కానీ తాము ఇళ్ల నిర్మాణానికి మాత్రమే బిల్లులు మంజూరు చేశామన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ (జయంతి)



భారతీయ సంతతికి చెందిన అమెరికన్ ఖగోళ భౌతికశాస్త్రవేత్త 'పద్మ విభూషణ్' గ్రహీత సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ 1910 అక్టోబరు 19న జన్మించారు. నక్షత్రాలపై ఆయన చేసిన పరిశోధనలకు 1983లో 'నోబెల్ పురస్కారాన్ని' విలియం ఆల్ఫ్రెడ్ ఫౌలర్‌తో కలసి పొందారు. దేశంలో తొలి నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ అన్న కుమారుడైన సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ కూడా నోబెల్ బహుమతి పొందడం విశేషం. చికాగో యూనివర్శిటీలో సుదీర్ఘకాలం ప్రొఫెసర్‌గా పనిచేశారు. 45మంది పీహెచ్‌డీ పొందేందుకు మార్గదర్శకం చేశారు. 1995 ఆగస్టు 21న కన్నుమూశారు. మరణానంతరం భార్య లలితా చంద్రశేఖర్ ఆయన జ్ఞాపకార్థం నోబెల్ పురస్కార మొత్తాన్ని చికాగో యూనివర్సిటీకి అందజేసి మెమోరియల్ స్కాలర్‌షిప్‌కు సహకరించారు.

ఇచ్ఛాపురపు జగన్నాథరావు (జయంతి)



ప్రముఖ తెలుగు కథా రచయిత ఐజే రావుగా పేరొందిన ఇచ్చాపురపు జగన్నాథ రావు 1931 అక్టోబరు 19న వైజాగ్‌లో జన్మించారు. సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో నేరుగా క్లాస్-1 అధికారిగా నియమితులయ్యారు. సీఈఎస్‌టీఏటీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. కోల్కత్తా, చెన్నైలలో కస్టమ్స్ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రవృత్తిగా రచనలు చేశారు. ఎదురద్దాలు, మొగలిరేఖలు, నీటిమీద దీపాలు, తుమ్మెద, గులాబి ముల్లు వంటివి పేరొందాయి. 1991లో పదవీ విరమణ అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన రచించిన కథానికలు, నవలలు, నాటికలు మొత్తం 13 సంపుటాలుగా వెలువడ్డాయి. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి పత్రికల్లో వీక్లీ కాలమ్స్ రాశారు. 1999లో తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. 2017 డిసెంబరు 13న కన్నుమూశారు.

బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన

దొడ్డబళ్లాపుర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలందరి సహకారంతోనే బాల్య వివాహాల నియంత్రణ సాధ్యమని తాలూకా స్త్రీ శిశుసంక్షేమ అధికారి రవికుమార్ అభిప్రాయపడ్డారు. స్థానిక సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్‌లో బేటీ బచావో బేటీ పడావో అభియానలో భాగంగా శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో ఇటీవల బాల్యవివాహాల సంఖ్య అధికమైందని ప్రత్యేకించి దొడ్డబళ్లాపుర తాలూకాలో పెరగడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రజలలో అవగాహనతోనే వీటికి అడ్డుకట్ట వేయగలమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యతోనే ప్రజల్లో మార్పు సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి అరుణ్ కుమార్, హాస్టల్ వార్డెన్ రాధామణి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు తదితరులు

విద్యార్థులకు ట్రాక్‌సూట్, యూనిఫాం పంపిణీ



యూనిఫాంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు

శిడ్లఘట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ యువ నాయకుడు సందీప్‌రెడ్డి నేతృత్వంలో తాలూకాలోని సాదలి హోబళి తిమ్మసంద్ర గ్రామపంచాయతీ పరిధిలోని హాలేహళ్ళి గ్రామ పాఠశాల విద్యార్థులకు ట్రాక్‌సూట్, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి ఆదర్శాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రామాయణంలోని నైతిక విలువలు అన్ని కాలాలకు అన్వయిస్తాయన్నారు. రిటైర్డు టీచర్ సుబ్బణ్ణ మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన వ్యక్తి జ్ఞానం పొందడం ద్వారా మహర్షి అయ్యారన్నారు. అలాగే విద్యతో సమాజంలో రాణించాలన్నారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో పిల్లలకు గ్లాసు, ప్లేట్‌లను అందచేశారు. అనంతరం తలకాయలబెట్టలోని వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డు టీచర్ హెచ్‌ఎన్ సుబ్బణ్ణ, గ్రామపంచాయతీ అధ్యక్షుడు భైరారెడ్డి, గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు కృష్ణప్ప, గ్రామపంచాయతీ సభ్యులు రాజేశ్, రాకేశ్ సుశీల, నాగరాజ్, సుభాష్‌రెడ్డి, గ్రామ ప్రముఖులు వెంకటరమణప్ప, కృష్ణారెడ్డి, దేవరెడ్డి, భాస్కర్, బాబాజాన్, ఉపాధ్యాయులు మంజునాథ్, దీప, మునిరత్న, అమ్మజాన్, వెంకటలక్ష్మమ్మ, నాగమణి, వాల్మీకి సేన యువకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘానికి 64 నామినేషన్లు

బంగారపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి జరుగుతున్న ఎన్నికల్లో చివరిరోజు శుక్రవారం 16మంది నామినేషన్లు సమర్పించారు. గడువు ముగిసే సమయానికి 64 నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి మంజునాథచారి వెల్లడించారు. తాలూకా పంచాయతీ ఈఓ రవికుమార్, సీడీపీఓ మునిరాజు, వ్యవసాయ అధికారి ప్రతిభాలు నామినేషన్లు వేసి అందరినీ ఆశ్చర్య పరిచారు. ఎక్కువగా ప్రాథమిక విద్యావిభాగం, ఆరోగ్యశాఖల నుంచి నామినేషన్లు వచ్చాయి. ఆరోగ్యశాఖ అధికారి రవి ఐదోసారి నామినేషన్ సమర్పించగా వీరితోపాటు జీకే ప్రసాద్, కృష్ణ, పుష్పలు నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తాను నాలుగుసార్లు ఉద్యోగుల సంఘానికి ప్రాతినిథ్యం వహించానని ప్రస్తుతం ఐదోసారి నామినేషన్ వేశానన్నారు. సహాయక ఎన్నికల అధికారిగా బాబు జనార్దన్ నాయుడు వ్యవహరించారు.



నామినేషన్లు సమర్పిస్తున్న అభ్యర్థులు

అభిలింపిక్స్‌లో రాణించినవారికి ప్రోత్సాహకాలు



పోటీలను వీక్షిస్తున్న నిర్వాహకులు

బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల అబిలింపిక్స్ పోటీలలో రాణించినవారికి ప్రోత్సాహకాలను అందించారు. బెంగళూరులో సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థ ప్రాంగణంలో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాలనుంచి వందమంది విభిన్నమైన ప్రతిభ కల్గినవారు పాల్గొన్నారు. దివ్యాంగులలో నైపుణ్యతకు సంబంధించి నిర్వహించే పోటీలను అబిలింపిక్స్‌గా పిలుస్తారు. సమాచార, సాంకేతిక, ఆహారతోపాటు 15 విభాగాలలో పోటీలు జరిపారు. 17మంది ఉత్తమంగా రాణించారు. 2 బంగారు, 7 వెండి, 8 కాంస్య బహుమతులను పొందగా లకానిచౌహాన్ శబ్దాలను గుర్తించే విభాగంలో బంగారుపతకం సాధించగా, తమిళనాడుకు చెందిన మోహన్ వెండి పతకాన్ని, మైసూరుకు చెందిన విటుపన్ కాంస్య పతకాన్ని పొందారు. కర్ణాటకకు చెందిన పంజకోసేని కంప్యూటర్ ప్రోగ్రామ్‌లో రజతపతకం సాధించారు. ఫోటోగ్రఫీలో తమిళనాడుకు చెందిన ఆదిత్య బంగారు పతకాన్ని, నైపుణ్య విభాగంలో చెన్నైకు చెందిన గోవిందన్ బహుమతి సాధించారు. పోటీలు శుక్రవారం ముగిసినట్టు అబిలింపిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ జితేంద్ర అగర్వాల్ ప్రకటించారు.



కంప్యూటర్ ప్రోగ్రామింగ్ పోటీలు

ఆస్పత్రిలో స్వచ్ఛతా అభియాన

చేళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చేళూరు ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛతా అభియాన నిర్వహించారు. డాక్టర్ మౌనిక నేతృత్వంలో సిబ్బంది సుమారు రెండుగంటలపాటు శ్రమించి ఆసుపత్రి ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఆసుపత్రికి వచ్చేవారిలో గ్రామీణ ప్రాంతాలే వారే అధికమని వారికి తమవంతు నాణ్యమైన వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇక్కడి వైద్యసిబ్బంది కూడా రోగులపట్ల చక్కగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

రూ.47.89 లక్షలు స్వాధీనం

▸▸ రెండు చోరీ కేసులను ఛేదించిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న సొత్తును ప్రదర్శిస్తున్న పోలీసులు

చింతామణి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ఇళ్లలో జరిగిన చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి బంగారు, వెండి ఆభరణాలు, ఇండికా కారు సహా రూ.47.69 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ కుశాల్‌చౌక్సి వెల్లడించారు. చింతామణి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తాలూకాలోని అంబాజిదుర్గ హోబళి నాయనహళ్ళి గ్రామంలోని పీవీ కృష్ణారెడ్డి కుటుంబీకులు ఇంటికి బీగం వేసి తోట పనికి వెళ్లిన వేళ దుండగులు సుమారు రూ.7.5లక్షల విలువైన ఆభరణాల చోరీకి పాల్పడ్డారన్నారు. సెప్టెంబరు 16న చోరీపై బాధితుడు కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తాలూకాలోని హోబళి కాగతి గ్రామానికి చెందిన సెప్టెంబరు 14న రాజప్ప ఇంట్లో చోరీ జరిగిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారన్నారు. రెండు చోరీ కేసులలో ఏఎస్పీ ఇమామ్ ఖాసిమ్, చింతామణి ఉపవిభాగం డీఎస్పీ పి మురళీధరల నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిందితులు సత్యసాయి జిల్లా హిందూపుర పట్టణానికి చెందిన మహేశ్ అలియాస్ ఉప్పార మహేశ్ (25), బెంగళూరు కాటన్‌పేట జాలి మొహల్లారోడ్డుకు చెందిన చింతామణిలో ఉంటున్న గాంధీనగర్ నివాసి ముదాపీర్ (33), చింతామణి తాలూకా చన్నసంద్ర గ్రామ నివాసి ఏడీ సుల్తాన్ (22)లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి బంగారు, వెండి ఆభరణాలు, ఇండికా కారు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

బగర్‌హుకుం హక్కుపత్రాలివ్వాలి

బాగేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బగర్‌హుకు సాగుదారులు అర్జీ 53, 57, 59లలో సమర్పించినవారికి హక్కుపత్రాలు మంజూరు చేయాలని రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన (ప్రొఫెసర్ నంజుండస్వామి) సంఘం డిమాండ్ చేశాయి. శుక్రవారం బెంగళూరులోని రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ ఇంటి ముందు నిరసనకు బయల్దేరుతున్న సంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటశివారెడ్డి మాట్లాడుతూ తాలూకాలో బగర్‌హుకుం సాగుచీటీలకోసం వేలాదిమంది రైతులు అర్జీలు సమర్పించారని అయినా హక్కుపత్రాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. హక్కుపత్రాల సాధనకోసం బెంగళూరుకు వెళ్లి మంత్రిని కోరనున్నట్టు తెలిపారు. తాలూకా వ్యాప్తంగా వేలాదిమంది పేద, భూరహితులు ప్రభుత్వ, అటవీ భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుని కేసులు నమోదు చేశారని తీవ్రంగా ఆరోపించారు. రైతులపై నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దసంఖ్యలో రైతులు నిరసనకు బయల్దేరారు.



బెంగళూరుకు బయల్దేరుతున్న రైతుసంఘం నాయకులు

చాకలి శ్రీనివాస్ దొరికాడా..?

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంచలనం రేకెత్తించిన అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం కేసులో కీలక నిందితుడు చాకలి శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని. విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చిలమత్తూరు మండలంలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమ వద్ద వాచ్‌మన్ కుటుంబంలోని అత్తాకోడలిపై ఈనెల 11 అర్ధరాత్రి దాటాక ఆరుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, అంతర్రాష్ట్ర దొంగ ఎరుకుల నాగేంద్రతోపాటు మరో పాత నేరస్థుడు సాకే ప్రవీణ్‌కుమార్, ముగ్గురు మైనర్లను ఈనెల 15న పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచారాల్లో ఆరితేరిన కీలక నిందితుడు చాకలి శ్రీనివాస్ పరారీలో ఉన్నాడు. ఇతడిని పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పట్టణాల్లో ఇతడి కోసం నిఘావేశారు. ఈ తరుణంలో గురువారం సాయంత్రం మడకశిరలో ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అతడిని అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి విచారిస్తున్నట్లు తెలిసింది.

సెంట్రల్ సిలబస్..
చిన్న కథ కాదు..!

- చదువు ఒత్తిడి భరించలేక మాయమైన విద్యార్థి
- అత్తారింటికి ఆటోలో ప్రయాణం.. కథ సుఖాంతం
- సినిమాకు తీసుకెళ్లి.. ఊరడించి.. బడికి చేర్చిన తండ్రి

రాయలసీమలో ఒకప్పుడు ఫ్యాక్షన్ కోసం ఎంతకైనా తెగించేవారు. ఇప్పుడు బిడ్డల చదువుల కోసం అంతకు మించి చేస్తున్నారు. మరీ ముఖ్యంగా.. పల్లెటూరి తల్లిదండ్రులు చెమటను కరెన్సీ మూటలుగా మార్చి కార్పొరేటు విద్యాసంస్థలకు కట్టబెడుతున్నారు. తమ కష్టాలు పిల్లలు పడకూడదన్న తాపత్రయం వారిది. ఈ ఆలోచనతో ఇంటికి, ఊరికి దూరంగా.. నగరాలకు తీసుకువెళ్లి హాస్టళ్లలో వదులుతున్నారు. అక్కడ పసివారు పడే ఇబ్బందుల గురించి పెద్దగా ఆలోచించడం లేదు. 'వెళ్లను నాన్నా.. ఇంటి వద్దే ఉండి చదువుకుంటా..' అని కన్నబిడ్డలు కంటతడి పెడితే.. కన్నవారు కన్నీళ్లను దాచుకుని ఊరడిస్తుంటారు. 'బాగా చదువుకో.. భవిష్యత్తు బాగుంటుంది. నీ కోసమే కదా ఇదంతా..?' అని నచ్చజెప్పి వస్తుంటారు. కాదూ కూడదు అంటే.. కొందరు మొరటుగా రెండు దెబ్బలు వేస్తుంటారు. గట్టిగా మందలిస్తుంటారు.

అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న ఓ పల్లెటూరు వారిది. కొడుకును బాగా చదివించాలని నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి వరకు చదివించాడు. మరింత బాగా చదివించాలని గత ఏడాది 8వ తరగతికి కర్నూలులోని ఓ ప్రముఖ పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న ఆ పిల్లవాడు దసరా పండుగకు ఇంటికొచ్చాడు. సెలవులు పూర్తి కావడంతో కొడుకును తిరిగి బడికి పంపేందుకు తండ్రి బైక్‌పై అనంతపురం బస్టాండుకు వచ్చాడు. బస్సు ఇంకా రాకపోవడంతో 'వెళ్లి టిఫిన్ చేసి.. వచ్చేటప్పుడు వాటర్ బాటిల్, న్యూస్ పేపర్ తీసుకురా..' అని కొడుకును పంపించాడు తండ్రి. టిఫిన్‌కు వెళ్లిన కొడుకు అరగంట దాటినా తిరిగి రాకపోవడంతో తండ్రి కంగారు పడ్డాడు. స్నేహితులకు విషయం చెప్పి పలు ప్రాంతాల్లో గాలించాడు. అనంతపురంలో ఉంటున్న తన సోదరికి విషయం తెలియజేశాడు. ఆమె తన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్యకు సమాచారం ఇచ్చింది. 'మా అల్లుడు వస్తే ఇంట్లోకి పంపించు. నేను వెతికేందుకు వెళతా..' అని చెప్పింది. ఈ లోగా అల్లుడు ఆటోలో నేరుగా తన అత్త ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్ద దిగి.. అక్కడే తచ్చాడటం ప్రారంభించాడు. వాచ్‌మెన్ భార్య గమనించి.. 'మీ అల్లుడొచ్చాడు..' అని అత్తకు చెప్పింది. దీంతో వెంటనే అత్త దిగొచ్చి.. అల్లుడిని ఇంట్లోకి తీసుకెళ్లింది. సోదరుడికి సమాచారం ఇచ్చింది. అప్పటిదాకా కొడుకు ఏమయ్యాడో అని అల్లాడిపోయిన తండ్రి.. ఊపిరి పీల్చుకున్నాడు.

విషయం ఏమిటంటే..

సోదరి ఇంటికి చేరుకున్న విద్యార్థి తండ్రి.. 'ఏమైంది నాన్నా..?' అని అడిగాడు. ఇలా చెప్పాపెట్టకుండా మాయమైపోతే తన పరిస్థితి ఏమిటని ఆరాతీశాడు. అప్పుడు అసలు విషయం చెప్పాడు ఆ విద్యార్థి. 'ఎనిమిదో తరగతి వరకు స్టేట్ సిలబస్ చెప్పారు. ఇప్పుడు సెంట్రల్ సిలబస్ చెబుతున్నారు. ఇబ్బందిగా ఉంది..' అని బాధగా ముఖం పెట్టాడు. తండ్రికి విషయం అర్థమైంది. ఆవేశపడి కొడుకును తిట్టలేదు.. కొట్టలేదు. 'అదేం పెద్ద విషయం కాదులే.. నాతో చెబితే నేను చూసుకునేటోన్ని కదా..? బడిలో మాట్లాడేవాన్ని కదా..?' అని కొడుక్కు నచ్చజెప్పాడు. ఆ తరువాత సినిమాకు తీసుకెళ్లాడు. సినిమా చూసే క్రమంలో.. 'నువ్వు ఎలాగైనా చదువు. ఫస్ట్ రావాలని, సెకండ్ రావాలని లేదు. ప్రశాంతంగా చదువుకో.. పదో తరగతి పాసవ్వు చాలు. ఎలాంటి టెన్షన్ పడొద్దు..' అని అనునయించాడు. సినిమా అయిపోయాక.. 'ఇక బడికి వెళదామా..?' అని కొడుకును అడిగాడు తండ్రి. 'సరే.. పోదాం పద నాన్నా..' అన్నాడు ముద్దుల కొడుకు. బస్సు ఎక్కి.. సాయంత్రానికి ఇద్దరూ కర్నూలుకు చేరుకున్నారు. కొడుకును బడిలో దించి.. వెనుదిరిగాడు తండ్రి..!

- అనంతపురం క్రైం, ఆంధ్రజ్యోతి

కేజీహళ్లి-డీజేహళ్లి కేసుల వాపసుకు
మాజీ మంత్రి రోషన్‌బేగ్ వినతి

బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాడుగొండనహళ్ళి - దేవరజీవనహళ్ళి (కేజీహళ్ళి - డీజేహళ్ళి) గొడవలకు సంబంధించిన కేసులను వాపసు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి రోషన్‌బేగ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. హుబ్బళ్ళి గొడవ కేసును వాపసు తీసుకున్న తరహాలోనే బెంగళూరులో డీజేహళ్ళి-కేజీహళ్ళి కేసులను వాపసు తీసుకోవాలని సీఎం, డీసీఎంలను కోరారు. ఈ గొడవల్లో 35మంది జైలుకు వెళ్లారని, పలువురిపై గూండాయాక్ట్ కింద అరెస్టు చేశారన్నారు. వీరిలో మైనర్‌లు ఉన్నారని, అమాయకులను గుర్తించి వారిపై కేసులను వాపసు తీసుకోవాలన్నారు. డీజే హళ్లి, కేజీహళ్ళి గొడవ ఓ యువకుడు అసభ్యకరమైన పోస్టింగ్ చేశాడని తలెత్తిన విషయం విదితమే. అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే అఖండ శ్రీనివాస మూర్తి ఇంటిని దహనం చేయడంతోపాటు రెండు పోలీస్ స్టేషన్లపైనా దాడి, పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లను ధ్వంసం చేశారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుల

మహదేవపుర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రామాణికంగా కృషిచేస్తున్నట్టు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ గ్రాంట్ల సహకారంతో తాగునీరు, యూజీడీ పనులతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని కిత్తగనూరు, దొడ్డగుబ్బి, దొడ్డబనహళ్ళి, కన్నమంగల, సీగేహళ్ళి గ్రామ పంచాయతీల పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, చెరువు, రాజకాలువల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మాజీ మంత్రి అరవింద లింబావళి మార్గదర్శకంలో అభివృద్ధి కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ హోబళి బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, సీగేహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మంగళ, ఉపాధ్యక్షుడు సురేశ్‌బాబు, సభ్యులు మధు, ప్రముఖులు రామచంద్ర, రమేశ్, సోమశేఖర్, వెంకటేశ్, శక్తికేంద్ర అధ్యక్షుడు మంజు పాల్గొన్నారు.

వాల్మీకి ఆదర్శప్రాయులు

శిడ్లఘట్ట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయులని ఎమ్మెల్యే బిఎన్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. తాలూకా వ్యాప్తంగా వాల్మీకి జయంతి పలు చోట్ల ఘనంగా జరిగింది. తలకాయలబెట్టపైగల వాల్మీకి మహర్షి ఆలయంలోనూ, పట్టణంలోని మయూర సర్కిల్‌లోని ఆలయంలోనూ ప్రత్యేక అలంకరణ చేశారు. విశేషపూజల్లో ఎమ్మెల్యే పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. తహసీల్దార్ బీఎన్ స్వామి, తాలూకా పంచాయతీ ఈఓ ఆర్ హేమావతి, సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ హెచ్ జగదీశ్, బీఈఓ నరేంద్రకుమార్, నగరసభ కమిషనర్ మంజునాథ, నగరసభ అధ్యక్షుడు ఎంవీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతివ్యక్తి కళ్లను ప్రేమించాలి

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి కళ్లను ప్రేమించాలని అంటే కళ్ల జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాలుష్యంతోపాటు ఇతరత్రా సమస్యలనుంచి ముందస్తుగా రక్షణలు తీసుకోవాలని అగర్వాల్ ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు అమోద్‌నాయక్ అభిప్రాయపడ్డారు. సమాజంలో నేత్ర సమస్యలు పెరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ప్రపంచ నేత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వైట్‌ఫీల్డ్‌లో 30మంది చిన్నారులకు శుక్రవారం ఆసక్తికరమైన గేమ్‌లు, ప్రెజెంటేషన్‌ల ద్వారా మయోపియా వంటి దృష్టి సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం 20-30శాతం మందికి కంటి సమస్యలు ఉన్నాయని 2050 నాటికి 50శాతం పెరిగే అవకాశం ఉందని విచారం వ్యక్తం చేశారు. మయోపిక్ పిల్లలకు కంటి పరీక్షలు తరచూ జరిపించాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి కంటి పరీక్షలు జరిపించుకోవడం ద్వారా సమస్యలను ప్రాథమికంగానే పరిష్కరించవచ్చునన్నారు. నగర ప్రాంతాలలో 4శాతంమంది పిల్లల్లో దృష్టి సమస్యలు ఉన్నట్టు గుర్తించామన్నారు. చిన్నారులతోపాటు తల్లిదండ్రులకు కంటి పరీక్షలు జరిపారు.


రోడ్డు ప్రమాదంలో
ఎంబీబీఎస్ విద్యార్థి దుర్మరణం

▸▸ 'అనంత' విద్యార్థి మృతి పట్ల విచారం



చైతన్య (ఫైల్)

బెంగళూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎంబీబీఎస్ విద్యార్థి దుర్మరణం చెందారు. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన చైతన్య (21) కర్ణాటకలోని శివమొగ్గలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. బెంగళూరులో నివసిస్తున్న మిత్రుడితో ఓ ప్రాజెక్టును షేర్ చేసుకునేందుకు వచ్చాడు. హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌కు అనుబంధమైన అగర ప్రాంతంలో శుక్రవారం ద్విచక్రవాహనంపై వెడుతూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. శివమొగ్గ మెడికల్ కళాశాలలో చైతన్య మృతి పట్ల విషాదం నెలకొంది.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.93	1,612.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	36,919	657
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	36,799	10,534
సామర్థ్యం (టీఎంసీలు)	101.50	43.81

కోతి దాడిలో వ్యక్తికి గాయాలు

కంప్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలోని మెట్రి గ్రామం వద్ద నల్లముచ్చుకోతి దాడి చేయడంతో తిప్పేస్వామి అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గంగానగర్‌కు చెందిన తిప్పేస్వామి పనుల కోసం మెట్రికి వెళ్లి తిరిగి వస్తుండగా మహదేవతాత మఠం వద్ద చెట్టుపై వున్న నల్లముచ్చుకోతి ఒక్కసారిగా అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వెంటనే అక్కడున్న వారు కేకలు వేయడంతో వదిలి కొండల్లోకి పరిగెత్తింది. వెంటనే స్థానికులు... అతడిని కంప్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గతంలో కొన్ని రోజులుగా నల్లముచ్చుకోతులు కొట్టాల్, కంప్లి పట్టణంలోని కేఈబీ కార్యాలయం, షుగర్ ఫ్యాక్టరీ, కోటె దాడి చేశాయని స్థానికులు తెలిపారు. బోను ఏర్పాటు చేసి కోతులను బంధించాలని అటవీశాఖ అధికారులను గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు గిరీష్, హెచ్ కుమారస్వామి, జగదీష్, మల్లికార్జున, చౌడప్ప కోరారు.

రేపు విద్యుత్ అంతరాయం

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బళ్లారి గ్రామీణ జెస్కాం విభాగం పరిధిలో 110/11 కేవీ ఉప కేంద్రం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఎఫ్ 6 గురునాథ్ రైస్‌మిల్ మార్గంలో లింక్‌లైన్ పనులు నిర్వహిస్తున్నందున ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు గ్రామీణ విభాగం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోనబాబు తెలిపారు. ఈ కారణంగా ఫీడర్ నెంబరు 6 పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు జెస్కాంతో సహకరించాలని కోరారు.

గుంతలను పూడ్చండి..



గుంతలు పడ్డ ఎస్ఎస్ రోడ్డు

బళ్లారి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే చాలు పలు రహదారుల్లో గుంతలు తేలి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. అసలు ఇవి రోడ్లేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. బళ్లారి రూరల్ పరిధిలోని ఎస్ఎస్ 63 రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గుంతలను పూడ్చాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గుంతల వల్ల రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల్లో కాళ్లు, చేతులు పోగొట్టుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య

బళ్లారి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ పరిధిలోని హోస్పేట రోడ్డులో 30-40 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో బళ్లారి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి లైన్స్ షర్టు, బనియన్ ధరించి వున్నాడని పోలీసులు తెలిపారు.

ఉక్కు కర్మాగారాలు ఇంకెన్నాళ్లకు..?

- పదేళ్లయినా అడుగు పడని వైనం
- వేలాది ఎకరాల భూసేకరణతోనే సరి
- ఉద్యోగాల కోసం రైతుబిడ్డల ఎదురుచూపు
- నిరుపయోగంగా భూమి

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నవరత్న' కంపెనీల్లో ఒకటైన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) 2014 లో బళ్లారి జిల్లాలో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు చేస్తామని వేలాది ఎకరాల భూమి సేకరించింది. ఇప్పటి వరకు ఫ్యాక్టరీల ఊసే లేదు. ఫలితంగా రూ.28వేల కోట్ల మూలధన పెట్టుబడి నష్టపోతుండడంతో పాటు 50వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం లేకుండా పోయింది. దశాబ్ద కాలంగా సాగు, పారిశ్రామిక వినియోగం లేకుండా వేలాది ఎకరాల భూములు వృథాగా పడి ఉన్నాయి. తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో భూములు ఇచ్చిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎండీసీ 2014లో కర్ణాటక విజయనగర స్టీల్స్ లిమిటెడ్ (కేవీఎస్ఎల్)పేరుతో మూడు మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని నెలకొల్పుతుందని, దాని కోసం రూ.9వేల కోట్ల పెట్టుబడి పెట్టాలని, భవిష్యత్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని ఆరు మిలయన్ టన్నులకు పెంచుతామని చెప్పింది. ఈ మేరకు రూ. 639.61 కోట్లు పరిహారం చెల్లించి బళ్లారి శివారు ప్రాంతంలో వేణి వీరాపురం వద్ద 2,857.54 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. కర్ణాటక ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ)కి 2017 సంవత్సరంలో భూమిని అప్పగించింది. 2018లో భూమి స్వాధీన పత్రం అందజేసింది. నిబంధనల ప్రకారం స్వాధీన పత్రం పొందిన ఐదేళ్లలోపు ఉత్పత్తి ప్రారంభించాలి. కానీ ఇప్పటి వరకు ఎన్ఎండీసీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కనీసం పునాది కూడా వేయలేదు. ఫ్యాక్టరీ ఏర్పాటులో ఎన్ఎండీసీ జాప్యంపై బళ్లారి జిల్లా కేఐఏడీబీ అధికారులు కేంద్ర కార్యాలయానికి నివేదికలు పంపారు. అంతకు మునుపే ఎన్ఎండీసీకి నోటీసులు జారీ చేసినా ఫ్యాక్టరీ ఏర్పాటులో ఎలాంటి పురోగతి లేదు. ఫ్యాక్టరీని ప్రారంభించక పోవడంపై 34బి కింద నోటీసు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దానికి ఏమి సమాధానం చెప్పారో చెప్పడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలంటే అవసరమైన నీరు, ముడిసరుకు లేవని ఎన్ఎండీసీ సాకులు చెబుతున్నట్లు కేఐఏడీబీ వర్గాలు అంటున్నాయి. ఎన్ఎండీసీ, కేఐఓసీఎల్ రెండూ భారతీయ ఉక్కు మంత్రిత్వ శాఖల ఉండే సంస్థలు. ఒకవైపు సొంతంగా గనులు లేకుండా కేఐఓసీఎల్ ఫ్యాక్టరీ కొట్టుమిట్టాడుతోందని, మరోవైపు సండూరులోనే రెండు పెద్ద గనులు ఉన్నప్పటికీ ఫ్యాక్టరీని తెరిపించకుండా ఎన్ఎండీసీ మౌనంగా ఉండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కేఐఏడీబీ నిబంధనల ప్రకారం భూమిని కేటాయించిన 9 నెలల్లో నిర్మాణ ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుంది. భూసేకరణ జరిగిన ఐదేళ్లలోపు ఉత్పత్తి ప్రారంభించాలి. భూమి లీజు కాలాన్ని 99 ఏళ్లు పొడగించాలని కర్ణాటక ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ప్రస్తుతం కంపెనీ కొన్ని దేశాలలో వివిధ వ్యాపార అవకాశాల అన్వేషిస్తోంది. ఇపుడు భూమి నాన్ కరెంట్ ఆస్తిగా పరిగణలో ఉంది. తదుపరి ఆర్థిక నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం, కేబీఎస్ఎల్ మధ్య ఒప్పందంపై ఆధారపడి ఉంటాయి. ఇనుము ఉత్పత్తి రంగంలో ప్రైవేట్ కంపెనీ జిందాల్ గుత్తాధిపత్యం సాధించింది. ప్రధాన కర్మాగారం బళ్లారిలో ఉంది. ఎన్ఎండీసీ ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే జిందాల్‌కు ఆరోగ్యకరమైన పోటీ ఇవ్వవచ్చు. ఎన్ఎండీసీ ఫ్యాక్టరీ స్థాపిస్తే ఒకేసారి కనీసం రూ. 30వేల కోట్ల పెట్టుబడులు రావచ్చు.



బురదను పట్టించుకోని 'బుడా'

- గుంతలమయమైన రహదారి
- వాహనదారులకు తిప్పలు



బురదగుంటలుగా మారిన రహదారి

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వర్షంతో రహదారులు బురదమయమవుతున్నా బళ్లారి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) పట్టించుకోలేదని లారీ, టిప్పర్ డ్రైవర్లు వాపోతున్నారు. జిల్లా పరిధిలో మైనింగ్ గనులు ఉండడంతో ఇనుప ముడి ఖనిజానికి ఉపయోగించే టిప్పర్లు, లారీలు వేలాది సంఖ్యలో ఉన్నాయి. వీటికి అవసరమైన గ్యారేజీని బుడా ఆధ్వర్యంలో బెంగళూరు రోడ్డులో లారీ టెర్మినల్‌కు స్థలాన్ని కేటాయించారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతమంతా బుడా ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతోంది. లారీ టెర్మినల్‌లో రోడ్లు, మౌలిక సౌకర్యాలు, తాగునీరు, డ్రైనేజీల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంపై బుడా దృష్టి సారించక పోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయింది. టెర్మినల్‌లో ఎటు చూసినా గుంతలమయం కావడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్లు బురదమయం కావడంతో ఆ రోడ్లపై లారీలు మినహా... మనుషులు ఎవరూ నడవలేని అధ్వాన స్థితికి చేరుకుంది. రవాణా రంగంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఈ ప్రాంత సమస్యలపై ఎవరూ దృష్టి సారించడం లేదని మెకానిక్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలు, టిప్పర్లు మరమ్మతుకు ఇదే టెర్మినల్‌కు రావాల్సి ఉంటుంది. ఈ రోడ్లను చూసి లారీ, టిప్పర్ డ్రైవర్లు వెనుదిరిగిపోతున్నారని మెకానిక్‌లు వాపోతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఎన్నికల సమయంలో మాత్రమే ఈ ప్రాంతాన్ని సందర్శించి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చి వెళ్లారని, ఇంతవరకు తమవైపు తిరిగి చూడలేదని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. రాత్రి వేళ వీధి లైట్లు లేకపోవడంతో వాహనాల బ్యాటరీల ద్వారా లైటు వేసుకుని మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు చెప్పారు.



కంప్లిలో దెబ్బ తిన్న వరిపంట

నేలకొరిగిన పంటలు

కంప్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా చేతికొచ్చిన పంటలు నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండుమూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, ముద్దాపురం, తదితర గ్రామాల్లో వరి, ఇతర పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చే సమయంలో పంటలు ఇలా నష్టం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పంటలు బాగావండి చేతికొస్తాయనుకుంటే ఊహించని వర్షాలతో నేలపాలయ్యాయని తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- ఏఐసీసీ కార్యదర్శి గోపీనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి గోపీనాథ్

తోరణగల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బూతు స్థాయి నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు సండూరు ఉప ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి గోపీనాథ్ పలనియప్పన్ పేర్కొన్నారు. శుక్రవారం తోరణగల్లులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామని, ప్రతి ఇంటికి తెలియజేయాలని చెప్పారు. గృహలక్ష్మీ పథకం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కేపీసీసీ ఉపాధ్యక్షుడు హుస్సేన్ సాబ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ బడగర్, నాయకులు ఏకాంబరప్ప, కురేకుప్ప పుర సభ అధ్యక్షుడు కల్లుడప్ప, అల్లిపురం వీరేష్, గురుపాదప్ప, వీరేష్ పాల్గొన్నారు.

వాల్మీకి చిత్రపటం ఊరేగింపు



షుగర్ ఫ్యాక్టరీలో వాల్మీకి ఊరేగింపులో పాల్గొన్న సమాజ ప్రముఖులు

కంప్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో షుగర్ ఫ్యాక్టరీలో శుక్రవారం వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. కాళికాదేవి ఆలయం వద్ద నుంచి బళ్లారి రోడ్డులో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు శేఖర్, కిషోర్ మాట్లాడుతూ కల్యాణమండపం ఏర్పాటు చేసి పేదలు వివాహాలు జరుపుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. మనస్పర్థలు వదిలి అందరూ ఐకమత్యంగా ముందుకు రావాలన్నారు. అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఓబుళేసు, గోవిందు, ఆదినారాయణ, సూరి, చిరంజీవి, రవి, సమాజ సభ్యులుపాల్గొన్నారు.

ఆయుధాలను అప్పగించాలి: కలెక్టర్



జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సండూరు శాసనసభ ఉప ఎన్నికలు సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఈ నేపథ్యంలో లైసెన్స్ పొందిన ఆయుధాలను (జాతీయ బ్యాంకులు, రిజర్వు బ్యాంకు సెక్యూరిటీ గార్డులు మినహా) స్థానిక పోలీసు స్టేషన్‌లో నవంబరు 25వరకు డిపాజిట్ చేయాలని జిల్లా అధికారి, ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. సండూరు శాసనసభ నియోజకవర్గం పరిధిలోని సండూరు తాలూకా, వేణి వీరాపుర, తిమ్మలాపుర, ఏళుబెంచిలో లైసెన్సు ఆయుధాలు కలిగిన వారు అక్టోబరు 22లోగా ఆయా పోలీసుస్టేషన్‌లో అప్పగించాలని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.26, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 962 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.667 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

మహిళా కళాశాల ఏర్పాటు చేయండి

నారా లోకేశ్‌కు మంత్రి సత్యకుమార్ వినతి

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారికతపై గట్టిసందేశం పంపేవిధంగా రాయలసీమలో మహిళలకు ప్రత్యేక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేసే విషయాన్ని పరిశీలించామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు లేఖ పంపారు. ఆ లేఖను మంత్రి మీడియాకు విడుదల చేశారు. జనాభాలో సగం ఉన్న మహిళలకు స్థిరమైన అభివృద్ధి అవకాశాలు కల్పించే అంశంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లేఖలో అభిప్రాయపడ్డారు. రాయలసీమ సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, తగిన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇదేనని మంత్రి లేఖలో స్పష్టం చేశారు.

గౌరమ్మ దేవికి ప్రత్యేక పూజలు

కంప్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా కంప్లి పట్టణంలోని పేట బసవేశ్వరాలయంలో శుక్రవారం గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పాభిషేకం, ధూపదీపాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, భజనలు, కీర్తనలతో మొక్కులు సమర్పించుకున్నారు. ప్రతి యేటా ఈ పౌర్ణమికి అమ్మవారికి పేట బసవేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరుపుతామని మహిళలు తెలిపారు.



గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

హోసూరు జోన్

సమగ్ర బీమాతో సామాన్యులకు లబ్ధి: కలెక్టర్

హోసూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు చక్కటి వైద్యం అందించడానికి దోహదపడే ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకం ద్వారా మెరుగైన సేవలు అందించడంలో హోసూరు సెయింట్ పీటర్స్ ఆసుపత్రి మంచి పేరొందడంపై ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు స్వయంగా ప్రశంసా పత్రం అందజేశారు, హోసూరులో ఉన్న సెయింట్ పీటర్స్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకం క్రింద ప్రజలకు చక్కటి వైద్యసేవలు అందిస్తుండడంపై సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా ముత్తయ్య అందుకున్నారు. మెడికల్ కళాశాల ట్రస్టీ డాక్టర్ లాసియా తంబిదురై మీడియాతో మాట్లాడుతూ అత్యధిక మంది లబ్ధి పొందేలా వైద్యశాఖలో మంచిగా కృషి చేసిన వైద్యులకు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు.



సెయింట్ పీటర్స్ ఆసుపత్రిలో సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్

అడవిగేదెకు చికిత్స

హోసూరు అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రంలోని బన్నేరుఘట్ట నేషనల్ పార్కునుంచి హోసూరు రాష్ట్ర సరిహద్దులో జంతుప్రదర్శనశాలకు అడవి గేదె వచ్చింది. రెండు కళ్లు సరిగా కనబడక పోవడం, ఆహారం వెతుక్కునే శక్తి లేకపోవడంతో స్పృహ కోల్పోయింది. గమనించిన కార్మికులు జూ వైద్యులకు సమాచారం అందించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం అక్కడికి వచ్చి చికిత్స అందించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

హోసూరు అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలో వివిధ ప్రాజెక్టు పనులను డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై.ప్రకాశ్ ప్రారంభించారు. హోసూరు శాసనసభ నియోజకవర్గం హోసూరు పంచాయతీ యూనియన్ నాబార్డు ప్రాజెక్టు క్రింద నందిమంగళం పంచాయతీ పరిధిలోని నందిమంగళం గ్రామంలో లక్ష లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్‌వాటర్ ట్యాంక్‌ను సుమారు రూ.44 లక్షలతో, పెరుమాళ్లపల్లి గ్రామంలో 30 వేల లీటర్లు సామర్థ్యంగల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ రూ.18.42 లక్షలు చెన్నచంద్రం, ఇచ్చంగూరు, దొడ్డి, కూసనపల్లి రూ.14.31 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్, అలసపల్లి, సేవగానపల్లి, బట్వరపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, మున్సిపల్ కోశాధికారి త్యాగరాజన్, యూనియన్ డిప్యూటీ సెక్రటరీ రమేశ్, మున్సిపల్ యూత్ టీమ్ ఆర్గనైజర్ కలైసెల్వన్, డీఎంకే శేఖర్, ప్రభుత్వ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

రైతు సమస్యలపై ప్రత్యేక సమావేశం

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో రైతుల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతినెలా నిర్వహించే తరహాలో శుక్రవారం కూడా నిర్వమించారు. సెప్టెంబరు 20న నిర్వహించిన సమావేశంలో రైతుల నుంచి వచ్చిన 185 వినతి పత్రాలపై 177ను పరిష్కరించారన్నారు. ప్రస్తుత సమావేశంలో రైతుల నుంచి 234 అర్జీ లు అందాయని కలెక్టర్ సరయు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలపై చర్చించారు. అలాగే కృష్ణగిరి జిల్లాలో ప్రైవేట్ పాల సేకరణ సంస్థలు పాడి రైతుల సమస్యలను ప్రత్యేకంగా ఆలకించారు. బిఎంసీ ద్వారా ఆవిన్ బలిన్ కొనుగోలు కోసం ప్రధాన కార్యాలయానికి అర్జీపై చర్చించారు. వ్యవసాయ జిల్లా రెవెన్యూ అధికారి సాదనకురళ్, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు బచ్చయప్పన్, జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు, నటరాజన్, డిప్యూటీ డైరెక్టర్ గుణవతి, వ్యవసాయ అధికారి శ్రీనివాసన్ శాఖాధికారులు, వ్యవసాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సరయు

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఏసన్న

సిరుగుప్ప, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరెక్టర్ల ఎన్నికలకు శుక్రవారం ఆఖరుతేదీ కావడంతో జోరుగా నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి దేవేంద్రగౌడకు అందించారు. ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించి డైరెక్టర్ స్థానానికి ఏసన్న నామినేషన్ దాఖలు చేశారు. అన్ని ప్రభుత్వ డైరెక్టర్ల స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల పరిశీలన, 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు వుంటుందని అధికారులు తెలిపారు. ఈ నెల 28న పోలింగ్ నిర్వహించనున్నట్లు అధికారి తెలిపారు.

ఉత్తమ విద్యార్థినికి పురస్కారం

బళ్లారి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారం అందించారు. కేపీ హంస అనే విద్యార్థిని జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడంతో ఎమ్మెల్యేలు నాగేంద్ర, నారా భరత్‌రెడ్డి నేతృత్వంలో రూ. లక్ష చెక్కు అందించారు.



విద్యార్థినికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న దృశ్యం